andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6 । కనిష్ఠం 25.8



లోకేశ్వరం ఎస్సైగా అశోక్ బాధ్యతల స్వీకరణ

లోకేశ్వరం, ఆగస్టు16: లోకేశ్వరం ఎస్సైగా అశోక్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ 40రోజుల పాటు ఎస్సైగా విధులు నిర్వహించిన సక్రియానాయక్ ఎస్పీ కార్యాలయానికి బదిలీ కాగా నిజామాబాద్ పట్టణంలోని ఐదో టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న అశోక్‌ను లోకేశ్వరానికి బదిలీచేశారు. గత మూడు నెలల కాలంలో ఈ స్టేషన్‌లో ముగ్గురు ఎస్సైలు పనిచేయగా మోహన్‌రావు పదవీ విరమణ పొందగా ఇరువురు ఎస్సైలు తక్కువ సమయంలోనే బదిలీ అయ్యారు.



● అక్రమ డీ-1 పట్టాలకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళనచేసి అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం (ఫైల్)



● మామడ తహసీల్దార్‌కు అక్రమ డీ-1 పట్టాలపై ఫిర్యాదు చేస్తున్న సాంగ్వి గ్రామస్థులు (ఫైల్)

రాష్ట్రస్థాయిలో డీ-1 అక్రమార్కుల పైరవీలు!


నిర్మల్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీ-1 పట్టాలు, అక్రమ సెత్వారీల జారీ వ్యవహారంలో గతంలో చక్రం తిప్పిన కొంతమంది సిబ్బందిని తిరిగి మళ్లీఇదే జిల్లాకు రప్పించే దిశగా రాష్ట్రస్థాయిలో పైరవీలు సాగుతున్నాయంటున్నారు. దాదాపు 350 అక్రమ డీ-1 పట్టాలు దానికి సంబంధించిన సేత్వారీలను అక్రమంగా తయారు చేయించి వాటి ద్వారా కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాజేసినట్లు ఆరోపణలున్న సంగతి తెలిసిందే. దీనిపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అప్పట్లో జిల్లా కలెక్టర్‌కే కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి స్వయంగా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ ఆందోళనలు కూడా చేపట్టారు. అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతల బంధువులు వారి అనుచరులకు ఈ వ్యవహారంలో భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీన్నే లక్ష్యంగా చేసుకొని అప్పట్లో మహేశ్వర్‌రెడ్డి సర్కారుకు ఫిర్యాదు చేశారు. మహేశ్వర్ రెడ్డి ఫిర్యాదుల మేరకు అప్పటి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఈ అక్రమ డీ-1 పట్టాలు, సేత్వారీలపై విచారణ సైతం జరిపేందుకు చర్యలు చేపట్టారు. ప్రత్యేక కమిటీని నియమించి విచారణ నిర్వహించి దానికి సంబంధించిన నివేదికలను రూపొందించే క్రమంలోనే ఆయన బదిలీ అవ్వడంతో ఈ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. దీనిపై ప్రస్తుత కలెక్టర్ అభిలాష అభినవ్ సైతం విచారణ జరిపేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా తమ పాత తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకు కొంతమంది రాజకీయ నేతలు అక్రమాలకు సూత్రధారులుగా వ్యవహరించిన ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ సిబ్బందిని తిరిగి జిల్లాకు రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారంటున్నారు. అలాగే మరికొంతమంది జిల్లాలోని ఇతర మండలాలకు బదిలీ కాగా, వారిని కూడా జిల్లాకేంద్రానికి రప్పించేందు కోసం ముమ్మరంగా ప్రయత్నాలు సాగుతున్నాయని అంటున్నారు. అప్పట్లో ఇక్కడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసులో కీలకంగా వ్యవహరించి చక్రం తిప్పిన ఓ ఉద్యోగి కొద్దిరోజుల క్రితం దూరపు జిల్లాకు బదిలీపై వెళ్లారు. అయితే ఆయనను మళ్లీ బదిలీపై గాని డిప్యూటేషన్‌పై గానీ జిల్లాకు రప్పించే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయంటున్నారు. ఇప్పటికే డీ-1 సేత్వారీల దందాతో సంబంధాలున్న పలువురు రాజకీయ నేతలు ఈ ఉద్యోగిని రప్పించేందు కోసం పెద్దఎత్తున పైరవీలు చేస్తున్నారంటున్నారు. సదరు ఉద్యోగిని మరి కొంతమందిని ఇక్కడికి రప్పించుకొని గత డీ-1 పట్టాల అవకతవకలను వారి ద్వారా తొక్కిపెట్టించేందు కోసం ప్రయత్నిస్తున్నారన్న వాదనలు తలెత్తుతున్నాయి.

● భారీగా రికార్డుల గల్లంతు

డీ-1 పట్టాలు, సేత్వారీల అక్రమాలకు పాల్పడిన అప్పటి కొందరు ఉద్యోగులు వాటికి సంబంధించిన ఫైళ్లను రికార్డులను తారుమారు చేశారంటున్నారు. అలాగే కీలకమైన రికార్డులను అందుబాటులో లేకుండా చేశారన్న ఫిర్యాదులున్నాయి. అప్పట్లో ఇక్కడ పనిచేసిన ఏడీతో పాటు ఒకరిద్దరు ఉద్యోగులు ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించారన్నది బహిరంగ రహస్యమే. వీరికి రాజకీయ అండదండలు అధికార వర్గాల్లో పలుకుబడి ఉన్న కారణంగా అప్పటి నుంచి ఇప్పటివరకు వీరిపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సైతం వెనకాడుతున్నారంటున్నారు. కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను దర్జాగా స్వాహా చేసిన వ్యవహారంలో వీరు కీలకంగా వ్యవహరించినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడం ఇక్కడి అధికారిక వర్గాల్లో సైతం చర్చనీయాంశం అయ్యింది. అయితే కొద్దిరోజులు స్తబ్ధంగా ఉన్న ఈ వ్యవహారం మళ్లీ బదిలీలు, డిప్యూటేషన్‌ల కారణంగా మరోసారి చర్చకు తావిస్తోంది.

● రాజకీయ నేతల అండదండలు

అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలకనేత బంధువులు, వారి అనుచరులే ఈ అక్రమ దందాకు ప్రధాన సూత్రధారులుగా పేర్కొంటున్నారు. అయితే ఇప్పటికి కూడా వారికున్న రాజకీయ పలుకుబడితో మళ్లీ సర్కారు భూములపై కన్నేశారంటున్నారు. గతంలో నిలిచిపోయిన ఈ వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చేందుకు పెద్దఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయంటున్నారు. ఇందులో భాగంగానే తమకు అనుకూలమైన సిబ్బందిని బదిలీలు, డిప్యూటేషన్‌లపై ఇక్కడికి రప్పించేందు కోసం జోరుగా ప్రయత్నాలు మొదలయ్యాయన్న ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రస్థాయిలో సదరు నేతలకు ఉన్న రాజకీయ అండదండలతో ఈ వ్యవహారాన్ని గుట్టు చప్పుడు కాకుండా చేసేందుకు ప్రయత్నాలు ఊపందుకున్నాయంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం డీ-1 పట్టాలు, సేత్వారీల అక్రమాలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



● మామడలోని న్యూ సాంగ్వి ఎక్స్‌రోడ్డు వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం (ఫైల్)



భైంసాలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

వైభవంగా వరలక్ష్మీ వ్రత పూజలు

భైంసా, ఆగస్టు 16: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు వైభవోపేతంగా జరిగాయి. శ్రావణమాసంలో భాగంగా స్థానిక శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం, గోపాల్ కృష్ణమందిర్, శిశుమందిర్ పాఠశాలల్లో వరలక్ష్మీ పూజలు ప్రత్యేకంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే శుక్రవారం స్థానిక శిశుమందిర్ విద్యాసంస్థల్లో వరలక్ష్మీ అమ్మవారి చిత్రపటాన్ని శోభయమానంగా అలంకరించి వ్రతపూజలను చేపట్టారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో నిర్వహించబడిన ప్రత్యేకపూజ కన్నుల పండువగా సాగింది.

● ముథోల్‌లో..



ముథోల్‌లో వరలక్ష్మీవ్రత పూజలు చేస్తున్న మహిళలు

ముథోల్: మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు సిద్దేశ్వర్ స్వామి మంత్రోచ్చారణలతో వరలక్ష్మీ మాతకు పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు తమ ఇంటిలో ఉపవాసదీక్ష బూని భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతంను నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు వాయనం ఇచ్చుకున్నారు.

కుంటాల: మండల కేంద్రం కుంటాలలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు మహిళలు స్థానిక మహాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కుంటాల స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో శ్రావణమాసం శుక్లపక్షం పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం రోజు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

'కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి'

నిర్మల్ కల్చరల్, ఆగస్టు16: మాజీ మంత్రి కేటీఆర్ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కేటీఆర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంబడి రాజేశ్వర్, ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు శేఖర్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రాకేష్, తదితరులున్నారు.

ప్రతీ ఉద్యోగి విధిగా మొక్కలు నాటాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు16: ప్రతీ ఉద్యోగి విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఆర్డీవో రత్న కళ్యాణి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో మొక్కలు నాటారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ఏవో రాజేశ్వర్, తహసీల్దార్లు రాజు, సంతోష్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీగా అమీర్ అలీ నియామకం పట్ల పలువురి హర్షం

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 16: గవర్నర్ కోటాలో సియాసత్ ఉర్దూ పత్రిక చీఫ్ ఎడిటర్ అమీర్‌అలీఖాన్ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం నిర్మల్‌లో సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, సాయినత్, రిపోర్టర్ జలీల్ అజహర్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 16: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని జిల్లాకలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సీజనల్ వ్యాధులు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్, జ్యోతి బాపూలే, కేజీబీవీ, ఎస్సీ,ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, చికెన్‌గున్యావంటి వ్యాధులు వ్యాపించకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాల పరిసరాల్లో వర్షపు నీరునిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు విద్యాసంస్థల్లో 10వేల మంది విద్యార్థులకు జ్వర సర్వేలను నిర్వహించామని, ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని సూచించారు. ప్రతీ వసతి గృహంలో వైద్య సిబ్బంది, మందులు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. దోమలు వ్యాపించకుండా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్, దోమల నివారణ రసాయనాల పిచికారీ ప్రక్రియ నిరంతరం కొనసాగించాలన్నారు. కిటికీలకు దోమతెరలను అమర్చుకోవాలని తెలిపారు. అన్ని వసతిగృహాలు, పాఠశాలల్లో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, ఎంపీపీలు, వైద్యాధికారులు సమన్వయంతో విద్యాసంస్థల్లో వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. వసతి గృహాల్లోని ప్రతీ విద్యార్థికి రక్తపరీక్షలు నిర్వహించి, రక్తహీనత లోపం ఉన్న విద్యార్థులకు మందులు, ప్రత్యేక పోషకాహారాలు ఇవ్వాలని సూచించారు. వసతి గృహాల్లో విద్యార్థులచే పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో విషజ్వరాలకు సంబంధించి కేసులు వస్తున్న ప్రాంతాలను గుర్తించి నియంత్రణకు ప్రత్యేక చర్యలను చేపట్టాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా వసతి గృహాలలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. అలాగే వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాన్ని ఈ వారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, సంక్షేమ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, తదితరులున్నారు.

పాపన్న జయంతి నిర్వహణ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నిర్మల్ కల్చరల్, ఆగస్టు16: సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన అమరవేణి నర్సాగౌడ్‌ను శుక్రవారం ఎస్సీ, బీసీ సంఘాలు శాలువాతో సన్మానించాయి. ప్రభుత్వానికి అధికారికంగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు అనుముల భాస్కర్, ముడుసు సత్యనారాయణ, రాజాగౌడ్, నాగుల వెంకాగౌడ్, వి.నర్సాగౌడ్, నారాయణ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, అశ్విన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడికి యంగ్ సైంటిస్ట్ అవార్డు

బాసర, ఆగస్టు 16: బాసర ట్రిపుల్ ఐటీలో బయోలజీ డిపార్టు మెంట్‌కు చెందిన అధ్యాపకులు డా. కే.మధుసుదన్‌కు యంగ్‌సైంటిస్ట్ అవార్డు లభించింది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ సైన్స్ అకాడమి సంస్థ ఈ అవార్డును అందించింది. ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు, తెలంగాణ అకాడమి ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ వెంకటరమణ అభినందించి భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేసి రాణించాలని అన్నారు.



అవార్డు అందుకుంటున్న ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడు మధుసుదన్

బీటీ రోడ్డు కోసం.. ఖత్‌గామ్ గ్రామస్థుల ఆందోళన

● జాతీయ రహదారిపై రాస్తారోకో

● పోలీసు అధికారులతో వాగ్వాదం



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు



సీఐతో వాగ్వాదానికి దిగిన గ్రామ మాజీ సర్పంచ్ రాజు

భైంసా, ఆగస్టు16: తమ గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ భైంసా మండలం ఖత్‌గాం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. శుక్రవారం మాజీ సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో గ్రామస్థులు భైంసా- నిర్మల్ జాతీయ రహదారి మార్గంలోని ఖత్‌గాం క్రాస్‌రోడ్డు వద్ద రాస్తారోకో చేపట్టారు. బీటీ రోడ్డు నిర్మాణానికి స్పష్టమైన హామీనిచ్చేంత వరకు కదలబోమ వెల్లడించారు. గ్రామస్థుల రాస్తారోకో కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయి రోడ్డుకు ఇరువైపులా భారీసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సంబంధిత సమాచారం అందుకున్న టౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్‌ఐ షరీఫ్, రూరల్ సీఐ నైలూలు ఘటనాస్థలికి చేరుకొని రాస్తారోకో విరమింపచేసేందుకు విఫలయత్నం చేశారు. ఈ సందర్భంలో గ్రామస్థులు రాస్తారోకో విరమింప చేసేందుకు యత్నించిన పోలీసు అధికారులతో తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగారు. గ్రామానికి సరైన రోడ్డు లేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణం చేపట్టే విషయంలో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పరిస్థితి చేయిదాటిపోతుండటాన్ని పసగట్టిన పోలీసు అధికారులు ఆందోళనకారులను పక్కకు తీసుకువెళ్లి ట్రాఫిక్ పునరుద్ధరించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంలో గ్రామస్థులు మరోమారు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. అధికారులు వచ్చి తమకు స్పష్టమైన హామీనిస్తే తప్ప ఆందోళనలను విరమించేది లేదనది తేల్చి చెప్పారు. దీంతో టౌన్ సీఐ రాజారెడ్డి భైంసా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌ను ఘటనా స్థలికి పిలిపించి ఆందోళనకారులతో మాట్లాడించారు. సంబంధిత సమస్యను కలెక్టర్, ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరింపచేసేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. ఈక్రమంలో ఆందోళనకారులు శాంతించి తమ ఆందోళనలను విరమించి గ్రామానికి తరలిపోయారు.



డీసీసీ అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న నల్దుర్తి గ్రామస్థులు

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

మామడ, ఆగస్టు 16: మామడ మండలం నల్దుర్తి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు వీడీసీ సభ్యులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బస్సుసౌకర్యం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, మహిళలు మహాలక్ష్మీ పథకానికి దూరమవుతున్నారన్నారు. స్పందించిన డీసీసీ అధ్యక్షుడు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డితో మాట్లాడి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, వీడీసీ చైర్మన్ జీవన్‌నాయక్, సభ్యులు పడాల భీమేష్, భూమారెడ్డి, వెంకటరాములు, గణేష్, రాములు, గోంగు రాజేశ్వర్, తదితరులున్నారు.

ఎమ్మెల్సీగా కోదండరాం నియామకం పట్ల హర్షం

నిర్మల్‌కల్చరల్, ఆగస్టు16: ప్రొఫెసర్ కోదండరాంను తెలంగాణ ప్రభుత్వం ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడం పట్ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరంచైర్మన్ కొట్టే శేఖర్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఎం.రామకృష్ణగౌడ్ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదలచేశారు. తెలంగాణ సాధన తర్వాత అనేక ఆటుపోట్లు ఎదుర్కొని ముందుకు సాగిన ధీశాలి కోదండరాం అని పేర్కొన్నారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం కట్టుబడి ప్రజలపక్షాన నిలిచారని తెలిపారు. కోదండరాంను విద్యాశాఖ మంత్రిగా నియమిస్తే విద్యారంగానికి న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

● ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన టీజేఏసీ చైర్మన్

ఎమ్మెల్సీగా పదవి ప్రమాణ స్వీకారం చేసిన ఆచార్య కోదండరాంను జిల్లా టీజేఏసీ చైర్మన్ ఏ.విజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జనసమితి నాయకులు పాల్గొన్నారు.

నేడు హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భైంసా బంద్


భైంసా, ఆగస్టు16: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం భైంసా బంద్‌కు హిందూ ఐక్యవేదిక పిలుపునిచ్చింది. పట్టణ పరిధిలోని వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు బంద్‌కు సహకరించాలని హిందూ ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది. బంగ్లా ఘటనలకు వ్యతిరేకంగా హిందూ ఐక్య వేదిక చేపట్టిన బంద్‌కు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావ్ మద్దతును ప్రకటించారు.

● భారీ పోలీసు బందోబస్తు

హిందూ ఐక్య వేదిక బంద్ పిలుపు నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. బంద్ కారణంగా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు భారీ బందోబస్తుకు ఉపక్రమించింది. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో టౌన్ సీఐ రాజారెడ్డి భద్రతా చర్యలు చేపట్టనున్నారు.

బీసీ కులగణన పుస్తకం ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 16: బీసీ కులగణన జరగాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ రచించిన 'మావాటే మాకు' పుస్తకాన్ని శుక్రవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట తెలంగాణ రచయితల వేదిక గౌరవ అధ్యక్షుడు, కవులు డాక్టర్ దామెర రాములు, యు.కృష్ణంరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులగణనకు వెనుకడుగు వేస్తున్నాయన్నారు. కులగణన జరిగిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీలు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. అధ్యక్షుడు నేరెళ్ల హన్మంతు, కామారపు జగదీశ్వర్, నాగారం, శ్రీరాముల శ్రీనివాస్, పోలీసు భీమేష్, సాయన్న, పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో తెరవే కవులు

ఇచ్చోడలో స్వచ్ఛందంగా బంద్

ఇచ్చోడ, ఆగస్టు, 16: బంగ్లాదేశ్‌లో చోటు చేసుకున్న అమానవీయ ఘటనలు, హిందువులపై దాడులను నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం బంద్ పాటించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా మూసి ఉంచారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 16: ఆదిలాబాద్ జిల్లా నూతన వైద్యాధికారి కృష్ణ అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది డీఎంహెచ్‌ఓకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించారు. ప్రసవాలు, పారిశుధ్యం, ఆరోగ్య కేంద్రంలోని ప్రతి రూమ్‌లు పరిశీలించి, సిబ్బంది, డెంగ్యూ కేసుల వివరాలను డాక్టర్ సర్వరాజ్‌ను అడిగి తెలుసుకున్నారు.

గ్రామీణ బ్యాంకు ఎదుట రైతుల ధర్నా

ఉట్నూర్, ఆగస్టు 16: ఏజెన్సీ ప్రాంతాల గిరిజనేతర రైతులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, పంట రుణమాఫీ నిధులు విడుదల చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముందు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు భరత్‌చౌహాన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉట్నూర్‌కు వచ్చిన ముఖ్యమంత్రి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనేతర రైతులకు రెండు లక్షల వరకు పంట రుణమాఫీ చేయడంతో పాటు గిరిజనేతరుల భూమి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అమలు చేయడం లేదని అన్నారు. గిరిజనేతర రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి మాఫీ చేయక పోవడం విడ్డూరం అన్నారు. ఇప్పటికైనా రైతులకు పంట రుణాలు వెంటనే మాఫీ చేయాలని, గిరిజనేతర రైతులకు పహానీలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో బొంత ఆశారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

తాంసి సబ్‌స్టేషన్ ముట్టడి

తాంసి, ఆగస్టు 16 : చీటికి మాటికి కరెంట్ పోతుండటంతో ఆగ్రహించిన గ్రామస్తులు సబ్‌స్టేషన్ ముట్టడించారు. కరెంట్ ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియదని అంటూ అధికారులను నిలదీశారు. వాతావరణంలో ఎలాంటి మార్పులు లేకున్నా కరెంట్ ఎందుకు తీస్తున్నారు అంటూ మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని జామిడి గ్రామస్తులు వందలాదిగా తాంసి సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. రెండురోజుల నుంచి జామిడి గ్రామంలో కరెంట్ కోత విధిస్తున్నారని దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఏకంగా సబ్‌స్టేషన్ ముట్టడించి నిరసన వ్యక్తంచేశారు. ఎందుకు కరెంట్ తీస్తున్నారు అంటూ అధికారులను నిలదీశారు. 24 గంటలు కరెంట్‌ఉండాల్సి ఉన్నప్పటికీ ఎందుకు కోత విధిస్తున్నారు అంటూ మండిపడ్డారు. రోడ్డుపై గంటన్నర పాటు భైఠాయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కేశవరెడ్డి, శ్రీకాంత్, విశాల్, వామన్, రాహుల్, అరుణ్ తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

తలమడుగు, ఆగస్టు 16 : తలమడుగు మండల కేంద్రానికి చెందిన అంగ లక్ష్మీ (67) అనే మహిళ పురుగుల మందు సేవించి మృతి చెందినట్లు తలమడుగు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తలమడుగు గ్రామానికి చెందిన అంగ రాగేశ్వర్ భార్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి పడిపోగా కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.


కుటుంబ సమేతంగా పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

బాసర సరస్వతి సన్నిధిలో మాజీ మంత్రి కడియం శ్రీహరి ప్రత్యేక పూజలు

బాసర, ఆగస్టు 16: బాసర సరస్వతి అమ్మవారి సన్నిధిలో శుక్రవారం మాజీ మంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన పండితులు అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనవెంట బాసరమండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్‌రావు దేశాయ్, ఎం.రమేష్, జంగం రమేష్, రాజేశ్వర్ దేశ్‌ముఖ్, రాందాస్, తదితరులు ఉన్నారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా
24 గంటల పాటు ఓపీ సేవలు బంద్

● అత్యవసర కేసులకే సేవలు: ఐఎంఏ నిర్మల్

నిర్మల్‌అర్బన్, ఆగస్టు16: కోల్‌కతాలో ట్రైనీవైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ 24 గంటలపాటు ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ నిర్మల్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఘటనకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశవ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఔట్ పేషెంట్ సేవలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. అత్యవసర వైద్యసేవలు మాత్రం కొనసాగుతాయని పేర్కొన్నారు. శిక్షణలో ఉన్న వైద్యురాలిని దారుణంగా హతమార్చిన ఈ ఘటనపై యావత్ సమాజం స్పందించాలని వారు ఈ సందర్భంగా కోరారు.

నేడు ఖానాపూర్‌లో వైద్యసేవల నిలిపివేత

ఖానాపూర్, ఆగస్టు16: కోల్‌కతాలో వైద్యురాలి అత్యాచార ఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఖానాపూర్‌లో వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు ఖానాపూర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి డాక్టర్ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఐఎంఏ పిలుపులో భాగంగా శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఖానాపూర్‌లోని ఆసుపత్రులలో వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేడు గీత శక్తి పుస్తకావిష్కరణ

ముథోల్, ఆగస్టు16: ముథోల్‌ని రబీంద్ర ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఇలేగాం గ్రామానికి చెందిన కవి రెడ్ల బాలాజీ రాసిన 'గీత శక్తి' అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భైంసారూరల్, ఆగస్టు16: మండలంలోని మాంజ్రీ గ్రామానికి చెందిన తాళ్ల లక్ష్మణ్ బుధవారంరాత్రి మాంజ్రీ సమీపంలో ఎడ్ల బండిని తప్పించే క్రమంలో బైకు అదుపు తప్పి పడిపోవడంతో తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు భైంసాలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం గురువారం నాందేడ్ పట్టణానికి ఆసుత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి తాళ్ల లక్ష్మణ్ మృతిచెందాడు. భార్య తాళ్ల గంగామణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

పోలీసు కస్టడీ నుంచి నిందితుడి పరారీ

● ఆర్మ్స్ యాక్టులో అరెస్టయిన నిందితుడు ● విలేకరుల సమావేశంలో అరెస్టు చూపించిన అర గంటకే పరారీ
● నిందితుడిపై ఇది వరకే 5 క్రిమినల్ కేసులు ● నిందితుడి కోసం పోలీసుల ముమ్మర గాలింపు

భైంసా,ఆగస్టు16: ఆర్మ్స్‌యాక్టు కేసులో అరెస్టు అయిన నిందితుడు పోలీసు కస్టడీ నుంచి పరారైన ఘటన భైంసా పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. పట్టణ పరిధిలోని నయాబాది కాలనీకు చెందిన అబ్దుల్ జుబేర్ (27)కు నేర చరిత్ర ఉంది. సంబంధిత యువకునిపై పట్టణ పోలీసుస్టేషన్‌లో ఇప్పటికే ఐదు క్రిమినల్ కేసులు ఉన్నాయి. పీడీ యాక్టుతోపాటు రౌడీ షీటర్‌గా కేసులు నమోదై ఉన్నాయి. ఈ సంవత్సరం మార్చి మాసంలో మిత్రుడిని హతమార్చిన కేసులు అరెస్టు చేయబడి రిమాండ్‌కు తరలించబడ్డాడు. ఇటీవలే బేయిల్‌పై జైలు నుంచి విడుదలైన అబ్దుల్ జుబేర్ తాజాగా ఆర్మ్స్ యాక్టు కింద పోలీసులు పట్టుకున్నారు. గురువారం నాందేడ్ క్రాస్ రోడ్డు సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న టౌన్ ఎస్ఐ షరీఫ్‌కు అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న అబ్దుల్ జుబేర్‌ను పట్టుకోగా అతని వద్ద కత్తి దొరికింది. అనంతరం నిందితుడిని ఇంటికి తీసుకవెళ్లి తనిఖీలు నిర్వహించగా తల్వార్ లభ్యమయ్యింది. కత్తి, తల్వార్‌లను స్వాధీనపరుచుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి నిందితుడిని ఆర్మ్స్ యాక్టు కేసు నమోదు చేశారు. అంతే కాకుండా నిందితుడు కత్తులను చేతపట్టుకొని ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ రౌడీజం ప్రదర్శిస్తున్నాడు. ఈ కారణాలతో నిందితుడు అబ్దుల్ జుబేర్‌పై పోలీసులు ఆర్మ్స్ యాక్టు కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు.


విలేకరుల సమావేశంలో నిందితుడు కత్తితో దిగిన ఫొటోలను చూపుతున్న ఏఎస్పీ

● అరెస్టు చూయించిన అర్ధగంటకే పరారీ

ఆర్మ్స్ యాక్టు కింద అరెస్టు చేయబడ్డ అబ్దుల్ జుబేర్ కేసు వివరాలను భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ శుక్రవారం పట్టణ పోలీసుస్టేషన్ అవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు. ఇందులో అబ్దుల్ జుబేర్‌ను ప్రవేశ పెట్టి కేసు వివరాలు తెలిపారు. నిందితుడి నుంచి స్వాధీన పరుచుకున్న కత్తి,తల్వార్‌లను ప్రదర్శించారు. నిందితుడు కత్తిని చేతబట్టిన సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఫోటోలను చూపించారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించేందుకు పోలీసులు ఏర్పాటు చేపట్టారు. ఇదే సమయంలో నిందితుడి పోలీసు స్టేషన్ నుంచి పారిపోయాడు.

● తాగు నీరు కావాలని చెప్పి పరారీ

కస్టడీలోనున్న నిందితుడు అబ్దుల్ జుబేర్ తనకు కాపలగా నున్న గదిలోని కానిస్టేబుళ్లకు తాగునీరు కావాలని అడిగినట్లుగా తెలిసింది. దీంతో ఒక కానిస్టేబుల్ తాగునీటిని తెచ్చేందుకు గది నుంచి బయటకు రాగా మరో కానిస్టేబుల్ కళ్లుగప్పి అబ్దుల్ జుబేర్ గది నుంచి బయటకు వచ్చి పోలీసు స్టేషన్ ప్రధాన గేట్ నుంచి వేగంగా పరిగెత్తుతూ పారిపోయాడు. సెకన్ల వ్యవధిలోనే నిందితుడి పారిపోతున్నట్లుగా గుర్తించిన పోలీసులు పట్టుకునేందుకు విఫలయత్నం చెందారు. నిందితుడి వెనుకే పోలీసులు పరిగెత్తిన్నప్పటికి వారికి చిక్కకుండా తప్పించుకొని పారిపోయాడు.

● నాలుగు బృందాలచే గాలింపు చర్యలు

కస్టడీనుంచి తప్పించుకొని పారిపోయిన నిందితుడు అబ్దుల్ జుబేర్‌ను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఏఎస్పీ అవినాష్ కుమార్ సారధ్యంలో టౌన్ సీఐ రాజారెడ్డి నేతృత్వంలో నిందితుడిని పట్టుకునేందుకు గాను నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేశారు. పట్టణ పరిధిలోని కుంట, నయాబాది, కుంచవల్లి పహాడ్ తదితర ప్రాంతాలతో పాటు పలు అనుమానిత ప్రాంతాల్లో పోలీసులు నిందితుని ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

నాలా భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

● ఆర్డీవో కోమల్ రెడ్డి

ముథోల్, ఆగస్టు16: రోడ్డుకు ఇరువైపులా ఉన్న నాళాల భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో బస్టాండ్ సమీపంలో ఉన్న రోడ్డు అవతలి వైపు భూమి ఆక్రమణకు గురి కావడంతో వర్షం కురిసినప్పుడు తరుచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో శుక్రవారం ఆర్డీవో, తహసీల్దార్ శ్రీకాంత్, సంఘటనా స్థలాన్ని స్వయంగా వచ్చి పరిశీలించారు. ఆర్డీవో దగ్గరుండి జేసీబీని తెప్పించి రోడ్డుకు అవతలివైపు గతంలో ఉన్న కాలువను తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా వర్షపు నీరు, మురికి నీరు వెళ్లడానికి కాలువను తవ్వించామన్నారు. ఇందులో ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. చట్టం అందరికీ సమానమే అన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముథోల్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో ఎస్సై సాయికిరణ్, పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ పటేల్, పంచాయతీ ఈవో ప్రసాద్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జేసీబీ సహాయంతో నాలాను తవ్విస్తున్న ఆర్డీవో


ఆలయ హోంగార్డులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

అడుగడుగునా లోపాలే..!

● బాసర సరస్వతి ఆలయాన్ని సందర్శించిన ఎస్పీ జానకి షర్మిల
● పోలీసుల పరిశీలనలో వెలుగులోకి అనేక తప్పిదాలు
● సీసీ కెమెరాల ఏర్పాటుపై అసంతృప్తి

బాసర, ఆగస్టు16: బాసర సరస్వతి ఆలయంలో హుండీ దొంగతనం ఘటన అనేకలోపాలను వెలేత్తి చూపుతోంది. రాష్ట్రంలోనే ప్రధాన దేవాలయాల్లో ఒకటైన బాసరగుడిలో దొంగతనాన్ని పోలీసుఅధికారులు సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఆలయప్రాంగణంలోని హుండీని ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లడమే కాకుండా ప్రధాన ఆలయంతోపాటు ఇతర ప్రధాన హుండీలను తెరిచేందుకు ప్రయత్నించడంపై అధికారులు ప్రధానదృష్టి పెట్టారు. భవిష్యత్తులో ఇలాంటివాటికి ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టారు. శుక్రవారం ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, ముథోల్ సీఐ మల్లేష్, స్థానిక ఎస్సై గణేష్ బాసర గుడిలో భద్రతా చర్యల గురించి పర్యవేక్షించారు. ఘటనాస్థలాలను, దుండగుడు వచ్చిన మార్గాలను జిల్లా పోలీసుఅధికారులు పరిశీలించారు. సీసీ కెమెరాలను ప్రదేశాలను పరిశీలించి అవిసరిగ్గా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. సరైన ప్రదేశాల్లో ఏర్పాటుచేయాలని ఆలయఈవో విజయరామరావుకు సూచించారు. ముఖ్యంగా ఆలయం లోపలికి వివిధమార్గాల గుండావెళ్లే ద్వారాలు ఉండడంపై అధికారులు అభ్యంతరం వ్యక్తంచేశారు. సీసీ కెమెరాలకు సంబంధించిన పెద్దడిస్‌ప్లే సెంటర్‌ను ఏర్పాటుచేసి 24/7 సెక్యూరిటీ సిబ్బంది మానిటరింగ్ చేయాలని నిర్ణయించారు. ఆలయం చుట్టూ, పరిసరాల్లో రాత్రుల్లో చీకటి ప్రదేశాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

● ఆలయ హోంగార్డుల మార్పు

ప్రస్తుతం ఆలయంలో సుమారు 30మంది వరకు ఆలయ హోంగార్డులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. వీరందరూ సుమారు 20 సంవత్సరాల నుంచి ఇక్కడ పనిచేస్తున్నారు. దీర్ఘకాలంగా పనిచేయడంపై అనేకసార్లు ఆలయఅధికారులే అభ్యంతరాలు వ్యక్తంచేశారు గతంలో పనిచేసిన అనేకమంది ఆలయ ఈవోలు వీరిని మార్చాలని పోలీసు శాఖకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేశారు. ఈచోరీ ఘటనతో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న హోంగార్డులను మార్చాలని నిర్ణయించినట్లు తెలిసింది. వీరందరి స్థానాల్లో కొత్తహోంగార్డులను ఇతరచోట్ల పనిచేసే వారికి బాసరకు బదిలీ చేయనున్నారు. ఘటన జరిగిన రాత్రి డ్యూటీలోఉన్న హోంగార్డులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

భైంసా రూరల్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ యాదవ్

భైంసారూరల్, ఆగస్టు16: భైంసా గ్రామీణ ఎస్సైగా శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై కే. శ్రీకాంత్ నిజామాబాద్‌కు బదిలీఅయ్యారు. మెండోరా పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై భైంసా రూరల్‌కు ఎస్సై శ్రీనివాస్‌యాదవ్ వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు.

అందకూర్‌లో ఒకరి మృతి

కుంటాల, ఆగస్టు 16: మండలంలోని అందకూర్ గ్రామానికి చెందిన బర్కుంట ఎల్లన్న (32) శుక్రవారం వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతిచెందినట్లు ఏఎస్సై దేవరావు తెలిపారు. ఎల్లన్న శుక్రవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లి పొలంలో కలుపు తీస్తుండగా జారిపడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవరావు తెలిపారు.


నేరడిగొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

మాఫీ పేరిట జనాన్ని మోసం చేయలేరు

● 15 ఆగస్టు లోపు రైతు రుణమాఫీ ఏమైంది?
● నేరడిగొండలో ఆయన నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, ఆగస్టు 16: రాష్ట్ర ముఖ్యమంత్రి జనాన్నిఎక్కువ కాలం మోసం చేయలేరని, ఆయన చెప్పినపట్లుగా రైతు రుణమాఫీ ఆగస్టు15 లోపు జరిగి ఉంటే సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యే వారని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరంగల్‌లో తెలంగాణ కాంగ్రెస్ తలపెట్టిన రుణమాఫీ సభకు సీఎం స్వయంగా వెళ్లి ఆహ్వానించినప్పటికీ రాహుల్ గాంధీ ఎందుకు రాలేదో? ప్రజలందరికి తెలుసన్నారు. ఇప్పటికి కేవలం రూ.18వేల కోట్లతో సుమారు 21లక్షల మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని ప్రభుత్వం ప్రకటించిన లెక్కలే స్పష్టం చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చెప్పింది నిజమైతే రాహుల్‌తో రుణమాఫీ జరిగిందని ప్రకటన చేయించి వరంగల్ సభ పెట్టి చూపించాలని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఉన్నది ఫాంహౌజ్ కాదని, అది ఫార్మర్ హౌజ్ అనే విషయాన్ని గ్రహించాలన్నారు. రేవంత్‌రెడ్డిలో ఫ్రస్టేషన్ కనిపిస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన అసమర్థ పాలనతో అపఖ్యాతి మూటగట్టుకున్నారని పేర్కొన్నారు. తన అసమర్థత నుంచి దృష్టి మళ్లించేందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నట్లు అన్నారు. ఇలాంటి అరకొర రుణమాఫీతో రైతులను మోసం చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతూ ప్రతిపక్ష నాయకులపై రంకెలు వేస్తూ సొంత డబ్బా కొట్టుకుంటున్న వారిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

● కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 16: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాసేవ భవన్‌లో మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో గెలిచే ఎంపీటీసీ, సర్పంచ్‌ల అభ్యర్థుల అభిప్రాయాలను కార్యకర్తల నుంచి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలలో అనుసరించాల్సిన కార్యాచరణపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను అధిక సంఖ్యలో గెలవాలన్నారు. కాగా ఆయా మండలాలు, గ్రామాల నుంచి గెలిచే నాయకుల పేర్లను సేకరించి పరిశీలిస్తామన్నారు. పార్టీ గెలుపు కోసం ప్రతీఒక్క కార్యకర్త పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కష్టపడాలన్నారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గిమ్మ సంతోష్, జైనథ్ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● కేటీఆర్ భేషరతుగా మహిళలకు క్షమాపణలు చెప్పాలి

ఆదిలాబాద్ అర్బన్: కాంగ్రెస్ కల్పిస్తున్న ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని మహిళలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రజాసేవ భవన్ ఎదుట కేటీఆర్ ఫ్లెక్సీ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.


కేటీఆర్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సహకార సంఘ చైర్మన్‌పై అవిశ్వాసానికి జిల్లా అధికారికి ఫిర్యాదు


బోథ్, ఆగస్టు 16: సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగానే శుక్రవారం సహకార సంఘం సభ్యులు జి.రాజు యాదవ్ చెట్ల ఉమేష్, బోథ్ డైరెక్టర్లతో పాటు కర్త్యాడ డైరెక్టర్ ద్యాగల నారాయణ, సోనాల ఎల్. పోశెట్టి, మరలపెల్లి సంఘం డైరెక్టర్ దిగంబర్, కౌటా(బి) సంఘం డైరెక్టర్ లక్ష్మీలు ప్రస్తుత సహకార సంఘం చైర్మన్‌ను తొలగించాలని జిల్లా కో ఆపరేటివ్ అధికారి మోహన్‌కు వినతిపత్రం అందించారు. వారు ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మన్ రైతు సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదని, రుణమాఫీలో ఎంతో మంది రైతుల పేర్లు రాకపోవడానికి కారణం సహకార సంఘం వారికి ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన సాధారణ సమావేశం జరుపకపోగా.. ఆరు నెలలకు ఒకసారి జరిగే మహాజన సభ జరపడం లేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతు సమస్యల దృష్టి సారించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా వివరించారు. కాగా, డైరెకర్ల ఫిర్యాదుతో సహకార సంఘం రాజకీయం రసవత్తరంగా మారనున్నది.



● పంప్‌హౌజ్ వద్ద పెన్‌గంగా నదిలో అందుబాటులో ఉన్న వరద నీరు



● హత్తిఘాట్ పంప్‌హౌజ్‌లో విద్యుత్ మోటార్లు



● పంప్‌హౌజ్ అధికారులకు విద్యుత్ శాఖ జారీ చేసిన కరెంట్ బిల్లు


హత్తిఘాట్‌కు.. షాక్

- జిల్లా సరిహద్దులో పెన్‌గంగా నదిపై కోర్టా-చనకా బ్యారేజీ ఎగువ భాగాన హత్తిఘాట్ పంప్‌హౌజ్ నిర్మాణం
- ఇప్పటి వరకు ఎకరం తడపలేదు.. అప్పుడే రూ.3.50 కోట్ల కరెంట్ బిల్లు
- ఏడేళ్లు గడిచిపోతున్నా.. అసంపూర్తిగానే కాలువల నిర్మాణ పనులు
- జిల్లా కలెక్టర్ అకౌంట్‌లో మూడేళ్లుగా రూ.16 కోట్ల నిధులు
- నీళ్లున్నా.. నిరుపయోగంగా పంప్ హౌజ్
- ఆ దిశగా చర్యలు చేపట్టని అధికారులు
- ఆయకట్టు రైతులకు తప్పని ఎదురుచూపులు
- కొత్త ప్రభుత్వంపైనే కోటి ఆశలు

ఆదిలాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర-జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నదిపై కోర్టా-చనకా బ్యారేజీ ఎగువ భాగాన నిర్మించిన హత్తిఘాట్ పంప్‌హౌజ్‌కు విద్యుత్ శాఖ షాకిచ్చింది. ఇప్పటి వరకు ఎకరం ఆయకట్టుకు సాగునీటిని అందించిన దాఖలాలు లేవు. కానీ రూ.3.50 కోట్ల కరెంట్ బిల్లు వచ్చింది. దీంతో అధికారులు అవాక్కవుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారులు హడావుడి చేసి వెట్‌రన్‌ను పూర్తి చేశారు. ఈ పంపుహౌజ్ ద్వారా ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాల్లోని 37,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు. హత్తిఘాట్ పంప్‌హౌజ్‌లో ఆరు పంపు మోటార్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే రెండు పంపు మోటార్ల వెట్‌రన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచిపోతున్నా.. హత్తిఘాట్ పంప్‌హౌజ్ ఊసెత్తడమే లేదు. నీటిని ఎత్తి పోసేందుకు సర్వం సిద్ధమైనా.. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టక పోవడంతో ఆయకట్టు రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. తలాపునే గోదారి ఉన్నా.. పంట పొలాలు తడారి పోతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూసేకరణే ప్రధాన సమస్య

లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టులో భాగంగా పెన్‌గంగానదిపై నిర్మిస్తున్న కోర్టా చనకా బ్యారేజితో పాటు హత్తిఘాట్ పంప్‌హౌజ్‌కు భూసేకరణే ప్రధాన సమస్యగా మారింది. భూములను ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నా.. నిధుల కొరతతో అధికారులు జాప్యం చేస్తూ వస్తున్నారు. చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించేందుకు 3,315 ఎకరాల భూసేకరణ అవసరం. కానీ 1,580 ఎకరాలను మాత్రమే సేకరించారు. మిగితా భూసేకరణకు నిధుల కొరత ఆటంకంగా మారింది. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో భూసేకరణ చేపట్టక పోవడంతో కాలువల నిర్మాణం అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. ఏడేళ్లుగా కాలువల నిర్మాణ పనులు పూర్తికాక పోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. కొంతమేర కాలువల నిర్మాణ పనులు పూర్తయినా.. నిర్వహణ లేక పగుళ్లు తేలి పూడిక నిండి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. డి-14, డి-19 కాలువల ద్వారా ఏడు డిస్ట్రిబ్యూటర్లతో ఆయకట్టుకు సాగునీటిని అందించాల్సి ఉంది. సుమారుగా రూ.80 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు ఉండడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్ చేతులెత్తేస్తున్నాడు. ఇకనైనా భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తేనే ఆయకట్టుకు సాగునీటిని అందించే అవకాశం ఉంటుంది.



● హత్తిఘాట్ పంప్‌హౌజ్‌లో కాలువ

నిధులు ఉన్నా.. నిరుపయోగమే..!!

గత ప్రభుత్వ హయాంలో హత్తిఘాట్ పంప్‌హౌజ్, కోర్టా-చనకా బ్యారేజీకి నిధుల కటకటతో పనులు కొంత అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. కానీ గత మూడేళ్ల క్రితమే భూసేకరణ కోసం జిల్లా కలెక్టర్ అకౌంట్‌లో రూ.16కోట్ల నిధులను ప్రభుత్వం జమ చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఫైనాన్స్ క్లియరెన్స్ ఇవ్వక పోవడంతో నిధులు ఉన్నా.. నిరుపయోగంగానే మారాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన హత్తిఘాట్ పంప్‌హౌజ్‌పై ఇంకా నిండు నిర్లక్ష్యమే కనిపిస్తోంది. ఏళ్ల తరబడి ఆయకట్టు రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఏటా పెన్‌గంగా నదిలో వేల క్యూసెక్కుల నీరు వృథాగా దిగువకు వెళ్లి పోతుంది. అందుబాటులో ఉన్న నీటిని ఎత్తిపోస్తే పంటలకు ఉపయోగపడే అవకాశం ఉండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకదృష్టిని సారించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సీజన్‌కు రూ.5కోట్ల కరెంట్ బిల్లు

2022లో హత్తిఘాట్ పంప్‌హౌజ్ కోసం ఎన్‌పీడీసీఎల్ నుంచి ఇరిగేషన్ అధికారులు సర్వీస్ నెం. ఏడీబీ559తో విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. హత్తిఘాట్ పంప్‌హౌజ్‌లో మొత్తం ఆరు భారీ విద్యుత్ మోటార్లు ఉన్నాయి. ఇందులో 3 పంప్ మోటార్లు 5.5 మెగావాట్ల సామర్థ్యం కాగా, మరో 3 పంప్‌మోటార్లు 12 మెగా వాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. గత రెండున్నరేళ్లుగా ఇరిగేషన్ క్యాటగిరి కింద ఫిక్స్‌డ్ చార్జీలను వేస్తు బిల్లును నమోదు చేస్తున్నారు. దీంతో 2024 మే వరకు రూ.3కోట్ల 41లక్షల 86వేల 74 రూపాయల కరెంట్ బిల్లు వచ్చింది. జూన్, జూలై మాసాలను కలుపుకుంటే సుమారుగా రూ.3కోట్ల 50 లక్షల వరకు బిల్లు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఒక 5.5 మెగావాట్ల పంప్ మోటార్‌ను ఒక సీజన్‌లో రన్ చేస్తే సుమారుగా రూ.2.50 కోట్ల విద్యుత్ బిల్లు.. అదే 12మెగావాట్ల పంపు మోటార్‌ను రన్ చేస్తే రూ.5కోట్ల వరకు విద్యుత్ బిల్లు వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత రెండున్నరేళ్ల నుంచి విద్యుత్ మోటార్లను రన్ చేసి ఉంటే రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు విద్యుత్ బిల్లుల రూపంలో చెల్లించాల్సి ఉండేదని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు.



సంక్షిప్త సమాచారం

నేడు ఆదిలాబాద్‌లో ప్రైవేటు ఆస్పత్రుల మూసివేత

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 16: కోల్‌కతాలో జరిగిన వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటనలు నిరసిస్తూ ఆదిలాబాద్ ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం ప్రైవేట్ ఆస్పతులన్నీ మూసివేసి బంద్ పాటిస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, శ్యాం ప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఆస్పత్రులన్నీ మూసివేస్తున్నట్లు తెలిపారు. నిరసన ప్రదర్శన ఉంటుందని, వైద్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

..ఉట్నూర్ బంద్ : ఐక్య వేదిక

ఉట్నూర్, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువుల పై, అక్కడి మైనార్టీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం ఉట్నూర్ బంద్ నిర్వహించనున్నట్లు హిందూ సంఘాల ఐక్య వేదిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. శనివారం ఉదయం 11గంటలకు వినాయకచౌక్ నుంచి ఐబీ చౌరస్తా వరకు మౌన ప్రదర్శన ఉంటుందని కదాడులను ఖండించే ప్రతి ఒక్క ప్రజాస్వామ్యవాది ప్రతి ఒక్క బంధువు వ్యాపార వాణిజ్య సంఘాల యజమానులు పాల్గొనవల్సిందిగా కోరారు.

'జిల్లా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ వైద్యుల ఖాళీలు'

ఉట్నూర్, ఆగస్టు 16: మండల కేంద్రంలోని జిల్లా వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి కాంట్రాక్ట్ వైద్యులు కావాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ సమావేశం మందిరంలో ఈ నెల 23న కాంట్రాక్టు వైద్యుల నియామకం కోసం ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని ఉట్నూర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జాదవ్‌ఉపేందర్ తెలిపారు. జనరల్ ఫిజిషియన్, ఆర్థోపెడిషియన్, అనిస్తీయ, ఫల్మానాలజి నిపుణుడు కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు ఏదైనా సమాచారం కావాలంటే ఫోన్ నెం.9849878635, 9490024909 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

వాగు ప్రవాహంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం

భీంపూర్, ఆగస్టు 16: మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని, సెంటర్ సాంగి, అంతర్గాం, వడూర్ తదితర శివారు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. వాగులు పొంగిపొర్లయి. ఇదుల్ల సావర్గం-పిప్పల్‌కోటి రహదారి వద్ద చిన్నవాగుపై నుంచి వరద ప్రవాహం ఉండడంతో ఆదిలాబాద్-కరంజి(టీ) రూట్‌లో ఆర్టీసీ సహా ఇతర వాహనాల రాకపోకలు అంతరాయం కలిగింది. దాదాపుగా గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఇదిలా ఉంటే ఈ వర్షంతో చెల్లలో మరింతగా కలుపు గడ్డి పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పిప్పల్‌కోటి-ఇదుల్ల సావర్గం రహదారి వద్ద నిలిచిన రాకపోకలు

పరిసరాల పరిశుభ్రతపై సర్వే చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● నార్నూర్‌లో 30 పడకల ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ ● అన్ని ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలన

నార్నూర్, ఆగస్టు 16: మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజార్షిషా శుక్రవారం సందర్శించారు. దీనిలో భాగంగా రిసెప్షన్ రూమ్‌లోని రిజిస్టర్, రికార్డులను పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేసిన జ్వర సంబంధిత వివరాలను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ, సాధారణ జ్వరాలకు సంబంధించి రిజిస్టర్‌లు వేర్వేరుగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే, వైద్యాధికారి, ఎంపీడీవో, ఎంపీవో, ఏపీఎం కారోబార్‌లు కలిసి ఫివర్ సర్వే, పారిశుద్యం, పరిసరాల పరిశుభ్రతపై ఫీల్డ్ విజిట్, ఇంటింటి సర్వే ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 3గంటల నుంచి 5గంటల వరకు చేపట్టాలని ఆదేశించారు. వైద్యుల కొరత ఉన్నందున ఇద్దరినీ నియమించడం జరుగుతుందని, ఒకరు తప్పనిసరిగా నైట్ డ్యూటికి నియమించాలని జిల్లా వైద్యాధికారి నరేందర్‌ను ఆదేశించారు. ర్యాపిడ్ టెస్టులు, బ్లడ్ టెస్టులు చేయాలని, పరికరాలు పనిచేయకపోతే రిపేర్ చేయించుకోవాలని బయోగ్రఫి మిషన్, మైక్రోస్కోప్ రిపేర్ చేయించుకొని వైద్యం అందించాలన్నారు. ఆ తర్వాత ఏఎన్‌సీలో ట్రీట్మెంట్ గర్భిణితో మాట్లాడుతూ బలమైన ఆహారం తీసుకోవడం వలన తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, అంగన్‌వాడీలో ఇస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అలాగే, నార్నూర్ నుంచి గాదిగూడకు రోడ్ సౌకర్యం కల్పించాలని, సీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నందున పరిష్కరించాలని, వైద్యులను నియమించాలని, తదితర సమస్యలపై గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన కలెక్టర్ వైద్యులను పది రోజుల్లో నియమిస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఆసుపత్రి చుట్టు పక్కల పరిసరాలు శుభ్రం చేయకపోవడంతో ఎంపీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఎంపీవో స్వప్నశీలను సస్పెండ్ చేయాలని తెలిపారు. ఇందులో తహసీల్దార్ జాడి రాజలింగం, వైద్యాధికారి రాంబాబు, ఎంపీడీవో జవహర్, సెక్రెటరీ దినేష్, వైద్య సిబ్బంది తదితరులున్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

● ఏకలవ్య ఆదర్శ పాఠశాలల సందర్శన

నార్నూర్: మండలంలోని అన్ని ఏకలవ్య ఆదర్శ పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం సందర్శించి స్టోర్‌రూం, డార్మెటరీ, డైనింగ్ హాల్, విద్యార్థులకు మెనూ ప్రకారం అందుతున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం స్టోర్ రూంను పరిశీలించి టమాటాలు ఎక్కువగా ఎందుకు నిల్వ ఉంచుకున్నారని, అవి తొందరగా పాడవుతాయని, ఎప్పటికప్పుడు మార్కెట్ నుంచి తాజా కూరగాయలు తెచ్చుకోవాలన్నారు. బియ్యం బస్తాలు, వంట సరుకులు కూరగాయాలు పరిశీలించి కిటికి నుంచి వర్షం నీరు రాకుండా జాలి ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులు ఆహారం తినే ముందు చేతులు శుభ్రం చేసుకునేలా ఉపాధ్యాయులు దగ్గరుండి పర్యవేక్షించాలని, పరిశుభ్రత పాటించాలన్నారు. డైనింగ్ హాల్‌లో భోంచేస్తున్న విద్యార్థులతో ముచ్చటిస్తూ భోజనం ఎలా ఉంది? కోడి గుడ్లు ఇస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఒక విద్యార్థికి ఎన్ని గ్రాముల చొప్పున ఇవ్వాలో అంతే పరిమాణంలో ఇవ్వాలని, కూరలు సరిపడేలా వండాలని, వెనుక వచ్చిన వారికి పప్పుతో సరిపెట్టుకోవాల్సి వస్తుందన్నారు. హాస్టల్ గదులను పరిశీలిస్తూ మరమ్మతులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజలింగం, ఎంపీడీవో జవహర్, ప్రధాన ఉపాధ్యాయుడు ఆంజనేయులు, వార్డెన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతం

● జిల్లావ్యాప్తంగా మహిళల ప్రత్యేక పూజలు

ఆదిలాఆద్ అర్బన్, ఆగస్టు 16: పవిత్ర శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదిలాబాద్‌లోని గోపాలకృష్ణ మఠంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. అలాగే వేద పండితులు మేఘరాజ్ శర్మ మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలతో అమ్మవారిని ఆరాధించారు.

ఉట్నూర్: శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం మహిళా లోకం అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించే వరలక్ష్మి వ్రతాలను ఏజెన్సీ ప్రాంతాల మహిళలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉట్నూర్ పట్టణంలోని మహిళలు ఇంటింటికి వరలక్ష్మి వ్రతాలను నిర్వహించుకున్నారు. ముఖ్యంగా మహిళలు ఉదయం నిద్ర లేచిన వెంటనే వాకిలి శుభ్రం చేసి కలాపు చల్లుకుని మహాలక్ష్మి చిత్రపటం తయారు చేసుకుని ప్రత్యేక అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తలమడుగు: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో వైభవంగా సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు మండలంలోని బరంపూర్, అర్లి(కే), దేవాపూర్, కుచలాపూర్, తలమడుగులోని లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఇందులో కమిటీ అధ్యక్షుడు ముద్దం ఇంద్రసేనరెడ్డి, మంతె రమేష్, లింగాల భూమన్న, కల్లెం తిరుపతి రెడ్డి, కాటిపెల్లి రామ్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు అసం రవి, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రంలో గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటరమణ అమ్మవారి ప్రత్యేకత, వరలక్ష్మి వ్రత వృత్తాంతాన్ని మహిళలకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహికంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహించి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఒకరికొకరు నోములను ఇచ్చి పుచ్చుకున్నారు. ఇందులో మండలంలోని ఆయా గ్రామాలతో పాటు జైనథ్ గ్రామ ప్రజలు మహిళలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

బజార్‌హత్నూర్: శ్రావణ మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా వరలక్ష్మి కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వోర్సి వెంకటరమణ మహిళలకు అన్ని సౌకర్యాలు కల్పించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బోథ్: మండలంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం పూజ కార్యక్రమాన్ని విజ్ఞాన్ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

తాంసి: వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలు మహిళలతో సందడిగా కనిపించాయి. ఏకధాటిగా వర్షం కురిసినప్పటికీ ఆయా గ్రామాలకు చెందిన మహిళలు వారివారి గ్రామాల్లో ఉన్న ఆలయాలకు వెళ్లి వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.



మత్తడిగూడలో సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ గిరిజనులు

పోరాటాల వీరుడు సిడాం శంబు

● తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురుకబాపురావు

ఉట్నూర్, ఆగస్టు 16: జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆదివాసుల హక్కులకై బీర్‌షముండా, రాంజీగోండు, కొమురంభీం పోరాటాల నుంచి ఆశయాలను స్ఫూర్తిని తీసుకొని జల్, జంగల్ జమీన్ నినాదంతో పోరాడిన ఆదివాసీ నాయకుడు సిడాంశంబు అని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురుక బాపురావు అన్నారు. మండలంలోని మత్తడిగూడలో మచ్చలుగూడ రాయిసెంటర్ అధ్యక్షుడు నైతం చిత్రు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాపురావు మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టాల -2005 పీసా యాక్ట్, 1/70 యాక్ట్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టాల పై పోరాడిన ఉద్యమ నేత తెలంగాణ పోరాట యోధుడు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుడుందెబ్బ వ్యవస్థాపకుడు దివంగత సిడాం శంబుపటేల్ విగ్రహ కమిటీ ఏర్పాటు చేయడం కోసం కమిటీని ఖరారు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలో సిడాం శంబుపటేల్ వారసులు సిడాం సోనేరావు గౌరవ అధ్యక్షుడిగా ఉంటారని, కమిటీ చైర్మన్‌గా పంద్ర జైవంత్ రావు, వైస్ చైర్మన్‌గా పుర్కబాపురావు, కనకయాదవ్‌రావు, మేస్రం శేఖర్, పెందోర్ ప్రభాకర్, కార్య నిర్వాహణ కార్యదర్శిగా ఆత్రంతిరుపతి, ప్రచార కార్యదర్శి హనుమంతరావు, సంస్కృతిక కార్యదర్శి సిడ్మకి సీతారామ్, కోశాధికారి కుంర వినాయకరావు, సలహదారులుగా నైతం చిత్రుపటేల్, మర్సకోల తిరుపతి, బొంత ఆశారెడ్డి, పంద్రమాణిక్‌రావు, మరపబాజీరవు, పెందోర్ అనిల్, తొడసం సుమన్, తదితరులు ఎన్నికయ్యారు.

'సమన్వయంతో మున్సిపాలిటీ అభివృద్ధి'

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 16: గ్రేడ్ వన్‌గా మారిన మున్సిపాలిటీని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో మార్నింగ్ వాక్‌లో భాగంగా ఖానాపూర్ చెరవును మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, అర్బన్ తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే చెరువును పరిశీలించారు. పట్టణంలో రూ.320 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రహదారి నిర్మాణం కోసం తీర్మానం

ఇచ్చోడ, ఆగస్టు, 16: మండలంలోని అడేగామ(కె) గ్రామస్థులు తమ గ్రామంలో నుంచి వెళ్తున్న ప్రధాన అంతర్ రాష్ట్ర రహదారికి ఇరువైపులా నివాసాలు కల్గి ఉన్న నిర్వాసితులకు నష్టపరిహారం అందజేయాలని ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్‌కు గ్రామస్థులు తీర్మాన పత్రాన్ని అందజేశారు. శుక్రవారం అడేగామ(కె) గ్రామాన్ని ఆయన సందర్శించిన సందర్భంగా గ్రామస్థులు అందరూ కలిసి భూ నిర్వాసితుల తీర్మానం మేరకు రోడ్డు పనులను ప్రారంభించాలని కోరారు. నష్టపరిహారం అందిన తరువాతనే రోడ్డు పనులను ప్రారంభించాలన్నారు. రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 17 ఫీట్లు మొత్తం 34 ఫీట్లు మాత్రమే రోడ్డు నిర్మాణం కోసం ఇస్తామని నిర్వాసితులు ఒప్పుకొని తీర్మానం చేశారని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రాంచందర్‌రెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, రవీందర్‌సింగ్, సంతోష్, శ్రీనివాస్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోతో మాట్లాడుతున్న అడేగామ(కె) గ్రామస్థులు